మహిళలకు సమాన హక్కులు లభించాలి


మహిళా దినోత్సవంలో పాల్గొన్న శ్రీనివాసాచారి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అన్ని రంగాల్లో రాణి స్తున్న మహిళలకు సమాన హక్కులు లభించాలని వాకర్స్ ఇంటర్నేషనల్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వై.శ్రీనివాసాచారి అన్నారు. మాత వాకర్స్ క్లబ్ నల్ల కుంట ఆధ్వర్యంలో శనివారం పద్మకాలనీ కమ్యూనిటీ హాల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... మహిళల పరిరక్షణ కోసం అనేక చట్టాలున్నా సక్రమంగా అమలు కాకపోవడంతో నేరాలు పెరిగిపోతున్నాయన్నారు. పలువురు మహిళలను ఘనంగా సత్కరించారు. మాత వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ మురళీధరుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అల్లాడి శ్రీనివాస్, కోశాధికారి జైహింద్ కోన్నేరు, చీఫ్ అడ్వైజర్ రామ లింగేశ్వర్‌రావు, వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షురాలు కృష్ణకుమారి, ఇంటర్నేషనల్ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలక్ట్ లింగప్రకాష్‌గుప్తా, మురళీకృష్ణ, నీలా శ్రీధర్, శోభాదేవి, హిమబిందు, ప్రవీణ్ నాయుడు, ఎ.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ నియామకాల్లో మాజీ సైనికులకు న్యాయం చేయాలి


ధర్నా చేస్తున్న మాజీ సైనికులు

కవాడిగూడ: టీఎస్‌పీఎస్సీ ఉద్యోగాలలో మాజీ సైనికులకు న్యాయం చేయాలని తెలంగాణ మాజీ సైనికులు బి.సురేందర్‌రెడ్డి, వి.రవికుమార్, సీహెచ్ సురేష్ కుమార్, ఆర్ మల్లారెడ్డి, ఆంజనేయులు, నరేందర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 55తో ఇబ్బంది పడుతున్న మాజీ సైనికులతో ప్రభుత్వం చర్చలు జరపాలని డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ మాజీ సైనికులు ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ సరిహద్దుల్లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా 17 నుంచి 20 సంవత్సరాలు ఉద్యోగం చేసి పదవి విరమణ పొందిన మాజీ సైనికులకు తెలంగాణ రాష్ట్రం ఉద్యోగాలలో రిజర్వేషన్ కల్పించకుండా అన్యాయం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రోస్టర్ పాయింట్ 13, 37 ప్రకారం తెలంగాణ రాష్ట్రం గ్రూప్–సి, డి పోస్టులలో మాజీ సైనికులకు కేవలం 2 శాతం మాత్రమే రిజర్వేషన్ అమలులో ఉందని కర్ణాటక, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో 10 నుంచి 12శాతం రిజర్వేషన్‌లు అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో బి.సంజీవ్‌కుమార్, వేణుగోపాల్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, సుజిత్ తదితరులు పాల్గొన్నారు.

మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించాలి

రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య


మహిళలతో ఆర్.కృష్ణయ్య, జస్టిస్ చంద్రయ్య

కాచిగూడ: మహిళా బిల్లులో బీసీ మహిళలకు సబ్ కోటా కల్పించినప్పుడే బీసీ మహిళలకు రాజ్యాధికారం దక్కుతుందని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. తెలంగాణ మహిళా జేఏసీ చైర్‌పర్సన్ మట్టా జయంతిగౌడ్ అధ్యక్షతన శనివారం కాచిగూడలోని అభినందన్ గ్రాండ్‌లో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ... మహిళా బిల్లులో బీసీ మహిళలకు జనాభా ప్రకారం సబ్ కోటా కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహిళా బిల్లులో బీసీ మహిళలకు ప్రాతినిధ్యం కల్పించకపోతే మహిళలా బిల్లుకు సార్థకత లేదన్నారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన మహిళలకు, ట్రాన్‌జెండర్ మహిళలకు, మహిళల సమస్యలపై పోరాటం చేస్తున్న పురుషులను ఘనంగా సన్మానించారు. వారికి జ్ఞాపికలను అందజేసి అభినందనలు తెలియజేశారు. రిటైర్డ్ జడ్జి జస్టిస్ బి.చంద్రయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, గండేటి విజయ్ కుమార్, కల్పనా దత్త, శశిశ్రీ, వేముల రామకృష్ణ, విజయలక్ష్మీ, జ్యోతి, కోట్ల శ్రీనివాస్, మంజుల, అన్నపూర్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కీర్తన (ట్రాన్స్‌జెండర్), ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ ప్రాచీ (ట్రాన్స్‌జెండర్) తదితరులు పాల్గొన్నారు.

డప్పు రమేష్ సేవలు చిరస్మరణీయం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తన ఆటపాట, డప్పు కళ ద్వారా ప్రజలను చైతన్యం చేయడంలో డప్పు రమేష్ చేసిన కృషి మరువలేనిదని ప్రముఖ సినీ దర్శకుడు బి.నర్సింగ్‌రావు అన్నారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జన నాట్య మండలి(జేఎన్ఎం) రమేష్ మిత్రులు ఆధ్వర్యంలో డప్పు రమేష్ ద్వితీయ సంస్మరణ సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్య వక్తగా పాల్గొన్న నర్సింగ్‌రావు మాట్లాడుతూ... పెట్టుబడిదారుల చేతుల్లో దేశ సంపద హరించుకుపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్క ఆలపించిన పాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విరసం నేత ప్రొఫెసర్ సి.ఖాసీం, రచయిత జి.అనురాధా, జేఎన్ఎం రమేష్ మిత్రులు భూపాల్, మాభూమి సంధ్య, రాజనర్సింహ తదితరులు పాల్గొన్నారు.

మరో పదేళ్లు కాంగ్రెస్‌కే అధికారం

చిక్కడపల్లి: రాష్ట్రంలో మరో పదేళ్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని ఆ పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెన్నడీ అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు అవుతున్న సందర్భంగా శనివారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. నగర కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుర్రం శంకర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆ పార్టీ నేతలు శీలం సత్యనారాయణ, కెన్నడీరాజు, జయేందర్‌బాబు, మారిశెట్టి నర్సింగ్‌రావు, యాదగిరిగౌడ్, జగదీశ్‌బాబు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా వసతులు

- తాగునీరు, డ్రైనేజీ పైప్‌లైన్లను ఆధునికీకరిస్తాం
- రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి చేస్తున్నాం
- ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ

కవాడిగూడ: ముషీరాబాద్ నియోజకవర్గంలో పెరిగిన జనాభా అవసరాలకు అనుగుణంగా మంచినీరు, డ్రైనేజీ పైప్‌లైన్ల ఆధునికీకరణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ప్రజలు భాగస్వాములు అయినప్పుడే నియోజకవర్గం అన్ని రంగాలలో అభివృద్ధి చెందుతుందన్నారు. శనివారం కవాడిగూడ డివిజన్‌లోని దేవి ప్రసాద్‌బాగ్, జ్యోతినగర్ బస్తీలలో రూ. 48 లక్షల వ్యయంతో, గంగానగర్‌లో రూ. 7 లక్షల 44 వేల నిధులతో శివరేజీ పైప్‌లైన్ పనులకు, బండమైసమ్మ నగర్‌లో రూ. 10 లక్షలతో నూతనంగా ఏర్పాటు చేసే మంచినీటి పైప్‌లైన్ నిర్మాణ పనులకు స్థానిక కార్పొరేటర్ జి.రచనశ్రీతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలో కనీస సౌకర్యాల కల్పనకు ఎప్పటికప్పుడు ఆయా శాఖల అధికారులను అప్రమత్తం చేస్తున్నామన్నారు. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా చిత్తశుద్ధితో కృషిచేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలోని బస్తీలు, కాలనీలు, మురకివాడల్లో జనాభాకు అనుగుణంగా మంచినీటి, డ్రైనేజీ పైప్‌లైన్లను ఆధునికీకరించిన తరువాతనే నూతనంగా వీడీ సీసీ రోడ్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నేతముఠా జైసింహా, బీజేపీ రాష్ట్ర నాయకులు జి.వెంకటేష్, డివిజన్ బీజేపీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎం.సి మహేందర్‌బాబు, ప్రధాన కార్యదర్శి ఎ.ప్రభాకర్ గంగపుత్ర, బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు ఆర్.రాంచందర్, నాయకులు రాజశేఖర్ గౌడ్, శ్రీకాంత్, రమణ, శ్రీహరి, బీజేపీ నేతలు కుమార్‌గౌడ్, శ్రీనివాస్, నవీన్, చంద్రశేఖర్, పరుశురాం, సలంద్రి దిలీప్‌యాదవ్, అనిల్, వాటర్‌వర్క్స్ డీజీఎం కార్తిక్‌రెడ్డి, మేనేజర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

కాచిగూడ: పర్యావరణాన్ని పటిష్ట పరచాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని, అందుకు ప్రత్యేకంగా 'గ్రీన్ కార్పొరేషన్' ఏర్పాటు చేయాలని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు రంగయ్య, జాతీయ సలహాదారు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గ్రీన్ కార్పొరేషన్‌కు రాష్ట్ర బడ్జెట్‌లో 10 శాతం నిధులు కేటాయించాలన్నారు. వాటితో బయోడిగ్రేడబుల్ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ఉత్పత్తులు పెంచడంతో పాటు చెట్లు నాటడం, సంరక్షించడం, సేంద్రియ వ్యవసాయం, చెరువుల సుందరీకరణ, సోలార్ విద్యుత్ ఉత్పత్తి, విద్యుత్ వాహనాలకు రాయితీలతో పాటు పర్యావరణ బలోపేతం కోసం ఆ నిధులు వినియోగించాలని కోరారు.

సకాలంలో పైప్‌లైన్ పనులు పూర్తి చేయండి


పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి

అంబర్‌పేట్: డివిజన్‌లో చేపట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనుల్లో జాప్యం లేకుండా పూర్తి చేయాలని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పోరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి జలమండలి అధికారులకు సూచించారు. శనివారం సాయిమధురానగర్‌లో చేపట్టిన డ్రైనేజీ పైపులైన్ పనులను ఆమె అధికారులతో కలిసి పరిశీలించారు. ఎంతోకాలంగా డ్రైనేజీ పనులతో సాయిమధురానగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారని పనులను పూర్తి చేసి వారి ఇబ్బందులను తొలగించాలని కోరారు.

కుల గణన జీవోతో నవశకం


మాట్లాడుతున్న మురళీకృష్ణ

నల్లకుంట: కుల గణన జీవోతో తెలంగాణ రాష్ట్రంలో నవ శకం ప్రారంభమైందని తెలంగాణ బీసీ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు కె.పి.మురళీకృష్ణ అన్నారు. ఈ జీవో జారీతో కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందుకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని తెలిపారు. శనివారం నల్లకుంట రత్నానగర్‌లోని జాగృతి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చరిత్రాత్మక కుల గణన జీవో జారితో ఎస్సీ, ఎస్టీ తదితర సామాజిక కులాలతో పాటు, 130 బీసీ కులాలు, ఇతర కులాల జనాభా లెక్కలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాల సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ డిమాండ్ నెరవేరబోతుందన్నారు. కుల గణన జీవో జారి చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు వేం నరేందర్ రెడ్డి, బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణ మోహన్, బీసీ సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

మోదీ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నాం

రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్


నల్లకుంటలో విలేకరులతో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవడమే కాకుండా ఆ పథకాల వల్ల లబ్ధిపొందిన వారిని కలుసుకుంటామని రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ అన్నారు. శనివారం ఫజల్ బీమా పథకం ద్వారా లబ్ధిపొందిన వారిని కలుసుకొని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నల్లకుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కె.లక్ష్మణ్ మాట్లాడుతూ... నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో పలు అభివృద్ధి కార్యక్రమాలను పేద వర్గాల కోసం ప్రవేశ పెట్టారని అన్నారు. తెలంగాణలో వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. మద్యం కుంభకోణం విషయంలో ఏడాదిగా దర్యాప్తు చేసిన తరువాతే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్టు చేశారని పేరకకొన్నారు. కవిత అరెస్టును రాజకీయాలకు ముడిపెట్టడం సరైంది కాదన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు నైసదం సత్యనారాయణమూర్తి, కార్పొరేటర్ రవిచారి, గుండగోని భరత్‌గౌడ్, రమేష్‌రామ్, జైపాల్‌రెడ్డి, నవీన్‌ముదిరాజ్, ఉపేందర్ పాల్గొన్నారు.

శిథిల భవనం కూల్చివేత

చిక్కడపల్లి: ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనరేట్ కార్యాలయం అవరణలో ఉన్న శిథిల భవనాన్ని కూల్చివేశారు. ఇరవై సంవత్సరాలుగా ఎలాంటి ఉపయోగం లేకుండా వృథాగాపడి ఉన్న భవనాన్ని మూడురోజులుగా కూల్చివేయడం ప్రారంభించారు. శనివారానికి మొత్తం శిథిల భవనం కూల్చివేశారు. శిథిలాలు కూడా పూర్తిగా తొలగించే పనులు మొదలుపెట్టారు. అరవై ఏళ్లనాడు నిర్మించిన వెల్ఫేర్ సెంటర్ భవనం అప్పట్లో కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాలకు ఉపయోగపడేది. అయితే 1995లో కార్మికశాఖ కమిషనరేట్ ఏర్పాటు అయిన తర్వాత కూడా కార్మికశాఖ కార్యాలయం అధికారుల ఛాంబర్‌గా, పేషీలుగా కూడా ఉపయోగించారు. కమిషనరేట్‌లో ఎన్నికల సమయంలో పోలింగ్ స్టేషన్‌లు కూడా ఈ భవనంలో ఏర్పాటు చేశారు. ఇరవై సంవత్సరాలుగా ఈ భవనం పూర్తిగా శిథిలంగా మారడంతో ఉపయోగంలో లేకుండా పోయింది. ప్రస్తుత కమిషనర్ కృష్ణ ఆదిత్య వచ్చిన తర్వాత ఇప్పుడు ఈ శిథిల భవనాన్ని కూల్చివేశారు.

చెత్త డంపింగ్ కేంద్రాల తొలగింపునకు ప్రణాళిక

అంబర్‌పేట్: అంబర్‌పేట నియోజకవర్గంలో మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణకు సిబ్బంది చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని డీఎంసీ మారుతీదివాకర్ సూచించారు. శనివారం గోల్నాక వార్డు కార్యాలయంలో ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలతతో కలిసి పారిశుద్ధ్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. దశలవారీగా బహిరంగ చెత్త డంపింగ్ కేంద్రాలను పూర్తి స్థాయిలో తొలగించేలా ప్రణాళిక సిద్ధం చేయాలని అలాగే స్వచ్ఛ ఆటోలతో చెత్త సేకరణను క్షేత్రస్థాయిలో పారదర్శకంగా సేకరించాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎస్ఎఫ్ఏలు, ఇతర పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

నల్లకుంట: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల బీసీ కులాల కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లు క్షత్రియ సమాజాన్ని కలిపి 'క్షత్రియ, సారోళ్లు, సోమ వంశ క్షత్రియ కార్పొరేషన్'ను ఏర్పాటు చేయాలని క్షత్రియ సారోళ్ల సామవంశ సారోళ్ల క్షత్రియ రాష్ట్ర నాయకులు బోరెద ప్రవీణ్ కుమార్, కొంగల రాంప్రసాద్, వేదాకర్‌లు శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక కార్పొరేషన్ కోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

టీ కొట్టు యజమాని హత్య కేసులో నిందితుడి రిమాండ్

ముషీరాబాద్: భోలక్‌పూర్‌లో టీ కొట్టు యజమానిని కత్తితో పొడిచి హత్య చేసిన నిందితుడిని ముషీరాబాద్ పోలీసులు అరెస్టు చేసి శనివారం రిమాండ్‌కు తరలించారు. ముషీరాబాద్ పీఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిక్కడపల్లి ఏసీపీ రమేష్‌కుమార్ ఈ ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. భోలక్‌పూర్‌లో టీకొట్టు నిర్వహిస్తున్న మహ్మద్ గౌస్(45) హత్య చేసిన ఫాయజ్ అహ్మద్(45)లు ఇద్దరు ఒకే ఇంట్లో అద్దెకు ఉండేవారని, ఇద్దరి మధ్య గత రెండున్నర సంవత్సరాలుగా విభేదాలు కొనసాగుతున్నాయని తెలిపారు. దీంతో ఇద్దరి మధ్య పలుమార్లు స్వల్ప ఘర్షణలు చోటు చేసుకున్నాయి. దీంతో ఒకరిపై ఒకరు కక్షలు పెంచుకున్నారు. గడిచిన 12వ తేదీన ఇద్దరి మధ్య వాగ్వావాదం జరిగింది. దీంతో మహ్మద్‌గౌస్ ఫాయజ్ అహ్మద్‌ను నీ అంతూ చూస్తానని బెదిరించాడని తెలిపారు. దీంతో ఫాయజ్ అహ్మద్ మహ్మద్‌గౌస్ నుంచి ప్రాణహానీ ఉందని దీంతో అతన్నే చంపివేయాలని నిర్ణయించుకొని ఈ నెల 12వ తేదీన మధ్యాహ్నం కత్తితో పొడిచి హత్య చేశాడు అని ఏసీపీ తెలిపారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఫాయజ్ అహ్మద్‌పై హత్యాయత్నం కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

కవిత అరెస్టుపై భగ్గుమన్న బీఆర్ఎస్ శ్రేణులు


అలీకేఫ్ చౌరస్తాలో నిరసనలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్...


రాంనగర్‌లో పాల్గొన్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ తదితరులు


లోయర్ ట్యాంక్ బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు

ముషీరాబాద్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు ఖండిస్తు బీఆర్ఎస్ శ్రేణులు శనివారం ముషీరాబాద్ నియోజకవర్గంలో రాంనగర్ చౌరస్తాలో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. కవితను వెంటనే విడుదల చేస్తూ నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముఠా గోపాల్ మాట్లాడుతూ... రాజకీయ లబ్ధి కోసమే ఈడీని అడ్డుపెట్టుకొని బీజేపీ పెద్దలు తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కవితను అరెస్టు చేయించారని ఆరోపించారు. బీఆర్ఎస్ కార్మిక విభాగం నేత రాంబాబుయాదవ్, నాయకులు ముఠా జయసింహ, మాజీ కార్పొరేటర్ ముఠా పద్మ, నాయకులు కొండా శ్రీధర్‌రెడ్డి, ముచ్చకుర్తి ప్రభాకర్, ఎర్రం శ్రీనివాస్, శ్యాంసుందర్, శివముదిరాజ్, సయ్యద్ అస్లాం, సురేందర్, రాకేష్‌కుమార్, వై.శ్రీనివాస్, ఆకుల అరుణ్, శ్రీకాంత్, సంపూర్ణ, ముఠా నరేష్, శ్రీధర్‌చారి, మామిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజకీయ కక్షతోనే...

అంబర్‌పేట్: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను రాజకీయ కక్షతోనే అరెస్టు చేశారని, ఇది అన్యాయం అని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కవితను ఈడీ అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శనివారం అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గ ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డితో పాటు పార్టీ శ్రేణులతో కలిసి ఆయన నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... కేంద్రంలో ఉన్న బీజేపీ రాజకీయ దురుద్దేశంతోనే కవితను అరెస్టు చేయించిందని ఆరోపించారు. లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ ముందు అరెస్టు చేసి ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను అణిచివేయాలని చూడటం దారుణమన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఉద్యమ పార్టీ అని ఇలాంటి కేసులు న్యాయపరంగా ఎదుర్కొంటుదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, బి.పద్మావెంకట్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు కె.పద్మావతిరెడ్డి, వనం రమేశ్, బీఆర్ఎస్ నాయకులు ఓంప్రకాశ్‌యాదవ్, దూసరి శ్రీనివాస్‌గౌడ్, ఎర్రబోలు నర్సింహారెడ్డి, మహేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సిద్ధార్థ తదితరులు పాల్గొన్నారు.

కవిత అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం...

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కవిత అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు జి.రాంబాబుయాదవ్, ప్రధాన కార్యదర్శి వి.మారయ్య అన్నారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... విచారణ సంస్థలకు సహకరిస్తున్న కవితకు అరెస్టు చేయడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు.

అరెస్టు అప్రజాస్వామికం: వంగపల్లి శ్రీనివాస్ మాదిగ

కవాడిగూడ: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు అప్రజాస్వామికం అని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత అరెస్టును ఖండిస్తూ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శనివారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వంగపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ... ఎంఆర్‌పీఎస్ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంబేడ్కర్ విగ్రహాల ముందు నిరసనకు పిలుపునిచ్చారు. అనంతరం చలో సెక్రటేరియట్ పిలుపునివ్వగా ఎంఆర్‌పీఎస్ నాయకులను అరెస్టు చేసి నాంపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఎంఆర్‌పీఎస్ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పొట్టపెంజర రమేష్, విద్యావిభాగం రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకటేష్, హైదరాబాద్ జిల్లా నాయకులు కె.రాహుల్, మహేష్, సాయిలు, అంజి, పాండు, బాబూరావు, నరేష్ పాల్గొన్నారు.

వేడుకగా రాఘవేంద్రస్వామి ఆరాధనోత్సవాలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాలేరు

కాచిగూడ: శ్రీ రాఘవేంద్ర తీర్థ గురుసార్వభౌమ 429వ ఆరాధనోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా శనివారం బర్కత్‌పురలోని మంత్రాలయ శ్రీ రాఘవేంద్ర స్వామి మఠంలో రాఘవేంద్రుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాఘవేంద్ర స్వామికి అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ ప్రత్యేక పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు, జీహెచ్ఎంసీ మాజీ ఫ్లోర్ లీడర్ దిడ్డి రాంబాబు, గరిగంటి రమేష్, కృష్ణ గౌడ్, రాఘవేంద్ర స్వామి మఠం మేనేజర్ కె.రాఘవేంద్రరావు, బీఆర్ఎస్ నేతలు ఎర్ర భీష్మదేవ్, ఓంప్రకాష్ యాదవ్, దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, శ్రీకాంత్ తదితరులు పూజల్లో పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శిగా విజయ్‌కుమార్


నియామకపు పత్రాన్ని అందజేస్తున్న ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: బీసీ సంక్షేమ సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శిగా గండెటి విజయ్ కుమార్‌ను నియమిస్తూ జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ... బీసీల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ఆర్.కృష్ణయ్య నేతృత్వంలో జరిగే ఉద్యమాలను విజయవంతం చేసేలా తనవంతు కృషి చేస్తానని అన్నారు. తనపై ఎంతో నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఆర్.కృష్ణయ్యకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, మట్ట జయంతి, వేముల రామకృష్ణ, వంశికృష్ణ పాల్గొన్నారు.

పత్తి అనిల్ కుటుంబానికి అండగా ఉంటాం

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి


అనిల్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న కిషన్‌రెడ్డి

అంబర్‌పేట్: బీజేపీ సీనియర్ నేత, ఆ పార్టీ సెంట్రల్ జిల్లా ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షుడు పత్తి అనిల్ మృతి పార్టీకి తీరనిలోటు అని కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. శనివారం పటేల్‌నగర్‌లోని మృతుడు నివాసం వద్ద అనిల్ మృతదేహానికి నివాళులు అర్పించి, కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి ప్రకటించారు. ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు, నేతలు భూషన్‌చారి, భిక్షపతి, యశ్వంత్, కృష్ణముదిరాజ్, రాంచందర్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానగర్ బస్తీ పంచ్ కమిటీ నూతన కార్యవర్గం

కాచిగూడ: గోల్నాక డివిజన్, కృష్ణానగర్ బస్తీ పంచ్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు కమిటీ ప్రధానకార్యదర్శి బి.శ్రీధర్ తెలిపారు. అధ్యక్షులుగా జి.రవీంద్రనాథ్, ఉపాధ్యక్షులుగా వి.నర్సింగ్‌రావు, డి.కృష్ణకుమార్, ప్రధానకార్యదర్శిగా బి.శ్రీధర్, సంయుక్త కార్యదర్శిగా ఎల్.చంద్రకాంత్, కోశాధికారులుగా ఎం.వేణుగోపాల్, ఎస్.పర్వతాలు, కన్వీనర్‌గా కె.ప్రదీప్ కుమార్, కార్యనిర్వహక కార్యదర్శులుగా ఎల్.నర్సింహ్మా, కె.యాదగిరి, పి.విజయ్‌కుమార్, ఎస్.తులసిరామ్, మరికొంత మందిని కార్యవర్గసభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆలయ పునర్నిర్మాణ కమిటీ నియామకానికి నోటిఫికేషన్

చిక్కడపల్లి: చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ ఆంజనేయస్వామి ఆలయం పునర్‌నిర్మాణ కమిటీ నియామకానికి తెలంగాణ దేవాదాయ ధర్మాదాయ శాఖ వారు నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ సందర్భంగా శనివారం చిక్కడపల్లిలోని వివేక్‌నగర్‌లో ఆలయ ఈవో మాచర్ల దేవనాథం మాట్లాడుతూ... నోటిఫికేషన్ విడుదయిన 10 రోజుల్లోగా ఆసక్తి ఉన్న వారు బొగ్గులకుంటలోని దేవాదాయశాఖ కమిషనర్ కార్యాలయంలో సహాయ కమిషనర్ కార్యాలయంలో తమ దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. నోటిఫికేషన్ ప్రతులను దేవాలయం నోటీసు బోర్డుపై ముషీరాబాద్ మండల కార్యాలయం జీహెచ్ఎంసీ కార్యాలయం నోటీసు బోర్డులపై అతికించినట్లు తెలిపారు.

మసీదుల వద్ద వసతులు కల్పిస్తాం


గోల్నాకలోని మసీదులో ప్లాస్టిక్ కవర్‌లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ లావణ్య

అంబర్‌పేట్: రంజాన్‌కు మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించేందుకు చొరువ తీసుకుంటానని గోల్నాక డివిజన్ కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శనివారం డివిజన్‌లోని పలు మసీదుల వద్ద పారిశుద్ధ్యం కోసం మసీదుల నిర్వహకులకు ప్లాస్టిక్ కవర్‌లను పంపిణీ చేశారు. రంజాన్ మాసంలో మసీదుల వద్ద మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. బీఆర్ఎస్ నాయకులు దూసరి శ్రీనివాస్‌గౌడ్, ఇతర బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

సీఎంపై బీఆర్ఎస్ నేతల వ్యాఖ్యలు దారుణం


పాక జ్ఞానేశ్వరి

చిక్కడపల్లి: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు నేపథ్యంలో బీఆర్ఎస్ నేతలు సీఎం రేవంత్‌రెడ్డిపై వ్యాఖ్యలు చేయడాన్ని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాక జ్ఞానేశ్వరిప్రసాద్ తీవ్రంగా ఖండించారు. శనివారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది కాబట్టి వారు కవితను అరెస్ట్ చేయాలనుకుంటే గత అసెంబ్లీ ఎన్నికలముందే అరెస్ట్ చేసి ఉండేవారని అన్నారు. ఆ ఎన్నికల ముందు అరెస్ట్ చేయకుండా ఎన్నికలయ్యాక మూడు నెలలకు అంటే పార్లమెంటు ఎన్నికలకు ముందు అరెస్ట్ చేయడం అంటే బీజేపీ వారు తమ రాజకీయ లబ్ధికోసమే చేశారని స్పష్టంగా అర్థమవుతోందన్నారు. ఈ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు మాత్రమే కాకుండా దేశ ప్రజలు అందరూ బీజేపీని చెంప చెళ్లుమనిపించి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడం ఖాయమన్నారు.